నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

సోమవారం 22 మే 2023

ఇషా' లో మేలైన వైద్య సేవలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇషా లో మేలైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని మెనెజ్మెంట్ సుధీర్ సాయి తెలిపారు. నిజామాబాద్ నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ సాయి ఇషా ఆసుపత్రిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెనెజ్మెంట్ సుధీర్ రెడ్డి, సాయి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు డాక్టర్ రాజేంద్రప్రసాద్ డయాబెటిక్, ఫిజీషియన్ ప్రగతి నగర్ నూతన భవనంలో వైద్య సేవలు అందించెందుకు నూతన హంగులతో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 24 గంటల వైద్యం సదుపాయం, మెడికల్, ల్యాబ్ సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

గ్రీన్ హైవే వద్దు.. బ్రౌన్ హైవే ముద్దు

- బైపాస్ వద్దంటూ రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం హాసకొత్తూర్ చౌరస్తా వద్ద 63వ నెంబర్ జాతీయ రహదారిపై రైతులు గ్రీన్ హైవే వద్దు.. బ్రౌన్ హైవే ముద్దు అంటూ రాస్తారోకో చేశారు. జాతీయ రహదారి విస్తరణ బైపాస్ రోడ్డు మార్గం ద్వారా వద్దని, ప్రస్తుతం ఉన్న ప్రతిపాదన ప్రకారమే రోడ్డు మార్గాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్ర రైతులు రాస్తారోకో చేపట్టారు.

వివరాలు మెయిన్‌లో..

ఇష్టారాజ్యంగా
చెక్‌డ్యాంల నిర్మాణం

- రైతులకు సమాచారం ఇవ్వకుండా పంట భూముల్లో నిర్మాణాలు
- ఆందోళనలో రైతులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని పోసన్‌పల్లి, అడవి లింగాల వాగుపై గత రెండు సంవత్సరాల క్రితం చెక్ డ్యామ్ నిర్మాణం మంజూరైంది. చెక్ డ్యాం నిర్మాణం చేపట్టే స్థలంలో చుట్టుపక్కల రైతులకు అందరికీ సమాచారం ఇవ్వకుండా కొందరి రైతుల అభిప్రాయం మేరకే చెక్ డ్యాం నిర్మాణానికి నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు మార్కింగ్ వేశారు. విషయం తెలుసుకున్న మరికొందరు రైతులు చెక్ డ్యాం మంజూరైన ప్రాంతంలో జరుగుతున్న పనులను చూసి రైతులు తమ పట్టా భూమిలో నుంచి చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టడం చూసి ఒక్కసారిగా అవక్కాయ్యారు.



పంట భూమిలో చేపడుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులు

వాగు మధ్యలో చెక్‌డ్యాం నిర్మించాల్సింది పోయి పక్కనే ఉన్న పట్టా భూముల్లో తమకు సమాచారం ఇవ్వకుండా పనులు ప్రారంభిస్తున్నారని నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు ఆయనకు ఇష్టం వచ్చినట్లుగా నిర్మాణాలు చేపట్టి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని అక్కడి ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పట్లో పంట భూములు కొనాలంటే వాటి విలువ సుమారు రూ.25 నుంచి 30 లక్షల వరకు ధర పలుకుతుందని అలాంటప్పుడు నీటిపారుదల శాఖ అధికారులు వాగు మధ్యలో చెక్‌డ్యాం నిర్మించకుండా పట్టా భూమిలో నిర్మిస్తున్నారని ఆందోళనకు గురవుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవట్లే..

ఈ విషయంపై రైతులు తమ భూమి కోల్పోతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని రైతులు అంటున్నారు. రైతులందరికీ న్యాయం జరిగే విధంగా వాగు మధ్యలో నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెక్ డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలని, నిబంధనల ప్రకారం చెక్‌డ్యాం నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం జరిగే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్
- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కామారెడ్డి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేను ప్రధానమైన రెండు డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. 28 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తున్నారని, వీవోఏలను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు. కామారెడ్డిలో సీసీలు వీవోలను బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఇవి తక్షణమే ఆపాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ వెంటనే సీసీలు బెదిరింపు చర్యలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటానని వారు హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వానికి తన తరఫున అప్పీల్ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు సీఐటీయూ జిల్లా కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు కె.రాజనర్సు, కామారెడ్డి ఐటీపీ వీవోఏల జిల్లా నాయకులు శివరాం, బాలరాజు, సరిత, శివా, రాజలింగం, అనసూయ, సురేందర్, మల్లేష్, ఉమాకాంత్, ఖండేరావు, రవి, షాహిన్, షా బేగం, నిర్మల, పద్మ కిషోర్, శీను నాయక్, అంజమ్మ, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

సిటీ దాటిన సిటీ బస్సులు

నిజామాబాద్ పట్టణంలో ప్రారంభించిన సిటీ బస్సులు మూణాళ్ల ముచ్చటగా మారాయి. పట్టణ ప్రజల దశాబ్దాల ఎదురుచూపుల తరువాత ప్రారంభించిన ఈ సర్వీసులు ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు తిరుగుతున్నాయి. నాలుగు సర్వీసులతో ప్రారంభించి రానున్న రోజుల్లో మరిన్ని బస్సులను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పిన ఆర్టీసీ అధికారులు... ఉన్న బస్సుల్లో నుంచి ప్రస్తుతం మూడు బస్సులు మాత్రమే తిప్పుతున్నారు. ఇవీనూ సిటీలో కాకుండా సిటీ బయటకు తిరుగుతున్నాయి. దీంతో సిటీ బస్సుల అసలు లక్ష్యం నీరుగారుతోంది.

- మూణ్నాల్ల ముచ్చటగా సర్వీసులు
- 4తో ప్రారంభం.. 3కు తగ్గిన వైనం
- ఆ బస్సులూ రూరల్ ప్రాంతాలకు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ నగరం విస్తరించడంతో సదూర ప్రాంతాల నుంచి ప్రజలు ఉపాధి, ఇతర అవసరాల కోసం పట్టణంలోకి రావాల్సి వస్తోంది. అయితే పెరిగిన ఆటో ఛార్జీలు ప్రజలకు భారంగా మారాయి. సుదీర్ఘకాలం ఎదురుచూపుల తరువాత రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ ఛైర్మన్ కావడంతో నగర ప్రజల చిరకాల కాంక్ష అయిన సిటీ బస్సులు రోడ్డెక్కాయి. 30 సంవత్సరాల తరువాత బస్సులు ప్రారంభమయ్యాయి. మొదట నాలుగు ప్రధాన రహదారుల్లో ఆరు సిటీ బస్సులను ప్రారంభిస్తామన్నారు. కానీ నాలుగు మాత్రమే ప్రారంభించారు. మొదట అర్సపల్లి నుంచి మాధవనగర్, 300 క్వార్టర్స్ నుంచి దుబ్బ, ముబారక్‌నగర్ టు బస్టాండ్ తదితర ప్రాంతాలకు సర్వీసులు ప్రారంభించారు. అయితే బస్సులు ప్రారంభించినప్పటికీ.. ప్రజల్లో అవగాహన కల్పించలేదు. పైగా ఈ బస్సులను ఎక్కేందుకు సరిపడా బస్టాప్‌లు లేకుండా పోయాయి. దీనికితోడు ఏ సమయంలో బస్సులు వస్తాయో టైం లేకుండా పోయింది. ఇక అన్నింటికి మించి బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచలేదు. దీంతో ప్రయాణికులకు అవసరమైన సమయంలో బస్సులు లేకుండా పోయాయి. ఫలితంగా ప్రజల నుంచి ఆశించిన స్పందన రాకుండా పోయింది. సాధారణంగా ఒక్కో బస్సు నుంచి రోజుకు రూ.5000 ఆదాయం వస్తుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేసినప్పటికీ.. కేవలం రూ.3000 నుంచి రూ.3,500 వరకు మాత్రమే ఆదాయం వచ్చింది. దీనిపై మరింత అవగాహన కల్పించాల్సింది పోయి సర్వీసులను రద్దు చేశారు.

సిటీ దాటిన సిటీ బస్సులు..

నిజామాబాద్ నగరానికి పరిమితం కావాల్సిన సిటీ బస్సులు.. మెల్లిమెల్లిగా గ్రామీణ బాట పట్టాయి. ప్రస్తుతం ఉన్న బస్సులను ఒక తెలంగాణ యూనివర్శిటీకి, మరోకటి అమృతాపూర్‌కు రూటులకు మళ్లించారు. ఇక బస్సు కలెక్టరేట్‌లోని ఉద్యోగులకు, సిబ్బందికి పరిమితమయ్యింది. ప్రస్తుతం నగరంలో 300 క్వార్టర్స్ నుంచి కలెక్టరేట్ వరకు మాత్రమే బస్సు నడుస్తోంది.



ప్రారంభ సమయంలో బస్టాండ్‌లో సిటీ బస్సులు (ఫైల్)


ప్యాకెట్ మనీ అంతా ఆటోలకే



నిజామాబాద్ నగరంలో ఆర్టీసీ సంస్థ నగర ప్రజలకు చేరువయ్యేందుకు ఏర్పాటు చేసిన సిటీ బస్సులను కొద్దిరోజులు నడిపించింది. ఇప్పుడు సిటీ బస్సులు అందుబాటులో లేకుండా పోవడంతో ఇబ్బంది అవుతోంది. గ్రామంలో నుంచి నగరానికి చేరుకోని కళాశాలకు ఆటోలో ప్రయాణం చేయాలంటే సమయానికి సిటీ బస్సులు ఉండటం లేదు. వచ్చిన పాకెట్ మనీ అంతా ఆటోచార్జీలకే అవుతున్నాయి.

– సౌందర్య, విద్యార్థిని

సిటీ బస్సులు పెంచాలి



నిజామాబాద్ కార్పొరేషన్ పరిధి విస్తరిస్తున్నప్పటికీ నగరంలో సిటీ బస్సులు ఏర్పాటు చేసినా.. సిటీ బస్సులు సమయానికి ఉండటం లేదు. నగర ప్రజలు నగరంలో తిరగడానికి ఆటో చార్జీలనే ఆశ్రయించాల్సి వస్తోంది. కనీసం సిటీ బస్సులో అయినా సమయానికి గమ్యాన్ని చేరుకుందామంటే సిటీ బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ విస్తరించినప్పటికీ సిటీ బస్సులు ఎక్కువగా లేవు. నలుమూలల సిటీ బస్సులను పెంచాలి.

– సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సీపీఐ(ఎం) నుంచి సబ్బని లత బహిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకురాలిగా, ఐద్వా జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సబ్బని లతను సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నుంచి బహిష్కరించినట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలోకి వెళ్లినందున, పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందున పార్టీ నుంచి బహిష్కరించినట్టు పేర్కొన్నారు. ఇకనుంచి పార్టీకి గానీ ఐద్వా సంఘానికి గానీ ఎలాంటి సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించేదేవరు..?



ఆస్పత్రి ఎదుట విరిగిపడిన చెట్టు కొమ్మలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట గత కొన్ని రోజుల క్రితం ఈదురు గాలులకు ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ప్రహరీ గోడకు ఆనుకుని ఉన్నా పెద్ద చెట్టు కొమ్మలు విరిగి ఆసుపత్రిపై పడ్డాయి. ఆనాటి నుంచి నేటి వరకు కొమ్మలను తొలగించే వారే కరువయ్యారు. ఇదే విషయమై పలువురు ఆసుపత్రి సిబ్బందిని కొమ్మల విషయమై అడగగా గ్రామపంచాయతీ వారు తొలగిస్తారని సమాధానం చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి పక్కన పడిఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కంపోస్టు షెడ్డే.. క్రీడా ప్రాంగణం

- బండారుపల్లిలో పల్లెప్రకృతి వనంలో..
- క్రీడా ప్రాంగణాలకు స్థలాలు కరువు



నాగన్‌పల్లిలో కంపోస్టు షెడ్డునే క్రీడా ప్రాంగణంగా ఏర్పాటు

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రభుత్వ స్థలాలలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టింది. అలాగే ప్రతి గ్రామానికి పలు క్రీడలను ఎంపికచేసి వాటికి సంబంధించిన సామాగ్రిని సైతం గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. కానీ బోధన్ మండలం నాగన్‌పల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కంపోస్టు షెడ్డే క్రీడా ప్రాంగణంగా ఎంపిక చేసి బోర్డు ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి కబడ్డీ క్రీడను ఎంపిక చేశారు. అంత వరకు బాగానే ఉంది. కానీ కంపోస్టు షెడ్డులో కబడ్డీ ఆట ఎలా ఆడాలో స్థలం ఎంపిక చేసిన అధికారులకే తెలియాలి. ప్రధాన రహదారి పక్కనే కంపోస్టు షెడ్డు, దాని వద్దనే క్రీడా ప్రాంగణం అంటూ బోర్డు ఏర్పాటు చేయడంతో చూసిన వారు ఇదేం క్రీడా ప్రాంగణమంటూ విస్మయం చెందుతున్నారు.

బండారుపల్లిలో ఊరికి అల్లంతా దూరాన...

అలాగే బండారుపల్లి గ్రామంలో సైతం ప్రభుత్వ స్థలం లేక ఊరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గల బృహత్ పల్లె ప్రకృతి వనంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశం మంచిదే అయినా ప్రభుత్వ స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. బండారుపల్లి గ్రామంలో రెండు కిలోమీటర్ల దూరంలో గల బృహత్ పల్లె ప్రకృతి వనంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో దూరాభారంగా మారింది. ఈ గ్రామానికి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు మంజూరైనట్లు పలువురు తెలిపారు. అలాగే గ్రామానికి క్రీడల కోసం అందించిన క్రీడ సామాగ్రి పల్లె ప్రకృతి వనంలో బిగించి వదిలేశారు. క్రీడా ప్రాంగణం బోర్డును సైతం పంచాయతీ సిబ్బందిచే నిర్లక్ష్యంగా రాయించి నామమాత్రంగా ఏర్పాటు చేయడం గమనార్హం. అధికారులు స్పందించి అనువైన స్థలాలను ఎంపికచేసి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల క్రీడాకారులు కోరుతున్నారు.

ధీమా ఇవ్వని బీమా

- పత్తాలేని ఫసల్ బీమా
- అకాల వర్షాలతో వేల ఎకరాల్లో పంట నష్టం
- నాలుగేండ్లుగా అమలు కాని బీమా
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- జిల్లాలో సుమారు 60 వేల ఎకరాలకు పైగా పంట నష్టం



ఇటీవల కురిసిన ఈదురుగాలులు, వర్షాలకు నష్టపోయిన పంట

నవతెలంగాణ-లింగంపేట్

ఆరుగాలం కష్టపడి పంట సాగుచేసిన రైతులకు అకాల వర్షాలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. పంటలు నష్టపోయినప్పుడు రైతులకు ధీమా కల్పించేందుకు ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం రైతులకు ధీమా ఇవ్వలేకుండా పోతోంది.



పంటల సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాల వలన రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి వైపరిత్యాల కారణంగా రైతులు పంటను నష్టపోతే రైతులను ఆదుకునేందుకు ఫసల్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయినా అన్నదాతకు మాత్రం ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు.

పత్తాలేని ఫసల్ బీమా..

వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి అప్పులు చేసి పంటలు సాగుచేసిన చిన్న సన్నగా రైతులకు ఇటీవల భారీ వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్ల వాన కారణంగా చేతికి వచ్చిన పంట తీవ్రంగా నష్టపోయారు. ప్రకృతి వైపరిత్యాల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాధారణంగా బ్యాంకు నుంచి పంట రుణాలు పొందిన రైతులకు పంట బీమా ప్రీమియం ఖాతాల నుంచి తీసుకుంటారు. దీంతో అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలు, వడగండ్ల వాన, కరువు సమయాల్లో రైతులకు బీమా వర్తించేటట్లు ఏర్పాటు చేశారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. పంట రుణాలు పొందిన రైతులకు బీమా తప్పనిసరిగా ఉండాలి. రుణాలు పొందిన వారు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరం చొప్పున ప్రీమియం చెల్లించడం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. ఉదహరణకు వరి పంట తీసుకుంటే.. వరి నాటు వేసినప్పటి నుంచి కోత వరకు బీమా వర్తిస్తుంది. ఇదిలా ఉండగా.. కామారెడ్డి జిల్లాలో 2,80,000 మంది సన్న, చిన్నకారు రైతులు ఉండగా.. ఇప్పటివరకు రైతులు ఫసల్ బీమా పథకం ద్వారా ప్రయోజనం పొందిన దాఖలాలు లేవు.

సుమారు 60 వేల ఎకరాలకు పైగా పంట నష్టం..

జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వాన కారణంగా సుమారు 60 ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో 41,960 మంది రైతులకు సంబంధించి 60వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని అధికారులు నివేదిక అందించారు. ముఖ్యంగా జిల్లావ్యాపంగా వరి 59,968 ఎకరాల్లో, మొక్కజొన్న 12,000 ఎకరాల్లో, మామిడి 223 ఎకరాల్లో, టమాటా 64 ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

నాలుగేండ్లుగా అమలు కానీ బీమా..

రైతుల పంటలకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బీమా పథకం అమలు కావడం లేదు. 2020-21 సంవత్సరంలో 1874 మంది రైతులు చెందిన 3426 ఎకరాల పంట నష్టం వాటిల్లింది. 2021-22 సంవత్సరంలో 1035మంది రైతులు 2817 ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. ప్రస్తుతం సుమారు 60,239 ఎకరాల్లో రైతులు పంట నష్టపోయారు. కానీ బీమా పథకం అమలు కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఆరెకరాలు పోయింది

వడగండ్ల వాన వలన ఆరెకరాల చేతికి వచ్చిన పంట నష్టపోయాను. ఇప్పటివరకు అధికారులు పంటను పరిశీలించారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టాను. అప్పుల పాలయ్యాను. ప్రభుత్వం బీమా అమలు చేసి ఆదుకోవాలి.

– జగ్గయ్య నాయక్, బోనాల తండా రైతు.

నాలుగేండ్లుగా చూస్తున్నా

నాలుగేండ్ల నుంచి బీమా కోసం చూస్తున్నా ఇప్పటిదాకా రాలేదు. అధికారులు సర్వే చేస్తున్నారు. కానీ బీమా అమలు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– మద్ద లక్ష్మయ్య, పర్మళ్ల, రైతు.

రోడ్డు ప్రమాదంలో ఆలూరు వాసులు మృతి

- మండల కేంద్రంలో విషాద ఛాయలు

నవతెలంగాణ-ఆర్మూర్



మెదక్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆలూర్ మండల వాసులు చనిపోయారు. ఈ ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లాలోని నర్సింగి మండల కేంద్రం వల్లూరు 64వ నంబరు జాతీయ రహదారిపై కారు, ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆలూరుకు చెందిన శేఖర్ (40), చిన్న కొడుకు యశ్వంత్ (11), గజ్వేల్‌కు చెందిన బాల నరసయ్య (65), మన్నెమ్మ (60) మతిచెందగా, శేఖర్ భార్య కవిత, పెద్ద కొడుకు అవినాష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లాకు చెందిన శేఖర్ అతని భార్య కవిత గత 20 సంవత్సరాలుగా ఆలూర్ మండల కేంద్రంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కవిత మైనారిటీ కళాశాల యందు వంట మనిషిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అవినాష్, యశ్వంత్ ఇద్దరు కుమారులు. గద్వేల్‌కు చెందిన చిన్నమ్మ చిన్నబాబు బాల నరసయ్య, మణెమ్మలు తమ ఇంటి వద్ద నిర్వహించనున్న ఎల్లమ్మ పండుగకు రావలసిందిగా చెప్పడానికి శనివారం ఆలూరు వచ్చారు. గజ్వేల్‌లో ఇటీవల శేఖర్ బంధువులు చనిపోగా వారిని మాట్లాడించడానికి వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. అదే క్రమంలో ఆరుగురు కలిసి ఆదివారం ఉదయం గజ్వేల్‌కు ఆటోపై బయలుదేరారు. నర్సింగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మత్యు కబలించింది. ఉదయమే గ్రామంలోని కాలనీవాసులకు గద్వేల్ వెళ్లి వస్తామని చెప్పి బయలుదేరిన వారు రోడ్డు ప్రమాద రూపంలో కుటుంబ సభ్యుల్లో ఇద్దరు మతి చెందడం, మరో ఇద్దరు తీవ్ర గాయాలవడంతో ఆలూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మతుల సన్నిహితుల రోదనలు మిన్నంటాయి.



ప్రమాదానికి గురైన కారు

ప్రేమించి పెళ్లికి నిరాకరించినందుకు యువతి ఆత్మహత్య

నవతెలంగాణ-నవీపేట్

ఓ యువకుడు ఏడు సంవత్సరాలుగా ప్రేమించి పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉరి వేసుకొని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నవీపేట్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన హరిణి (25), అక్తర్ ఏడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. హరిణి పెళ్లి విషయమై అడగగా నిరాకరించడం, ఇతర విషయాలలో ఇబ్బంది పెట్టడంతో మనస్థాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు బెడ్ షీట్ సహాయంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి ఎన్నేడ్ల దామోదర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

తాడ్వాయిలో ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-తాడ్వాయి



మండల కేంద్రంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామదేవతలు వద్ద బోనాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, పంటలకు చీడపీడలు రాకుండా కాపాడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మమ్ములను గుర్తించేదెప్పుడు?

- ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు
- వారి కృషితోనే జాతీయ స్థాయిలో పంచాయతీలకు అవార్డులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఎంపిడీఓ కార్యాలయం

పంచాయతీరాజ్ శాఖలో 2015లో ఈ పంచాయతీ వ్యవస్థ ప్రారంభమైన నుండి గ్రామపంచాయతీకి సంబంధించిన జనన, మరణ నమోదులు, టాక్స్ వివరములు, అనుమతులు, వృత్తి, వ్యాపార లైసెన్స్ జారి, గ్రామ పంచాయతీకి సంబంధించిన చెక్కుల జారి, ఆన్లైన్ లావాదేవీలు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, ఈ పంచాయతీ పోర్టల్లో గ్రామపంచాయతీ వివరాల నమోదు, నెలవారీగా రిపోర్టులు క్రోడీకరణ, ఈ గ్రామ స్వరాజ్ పోర్టల్లో గ్రామపంచాయతీ వివరాలు నమోదు, ఆన్లైన్ ఆడిట్, నెలవారి మాస నివేదికలు తయారు వంటి సేవలు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు నిర్విరామంగా చేస్తున్నారు. అంతే కాకుండా ఎన్నికల సమయంలో, దళిత బంధు డాటా ఎంట్రీ సమయంలో, కరోనా వ్యాక్సిన్, సబ్సిడీ రుణాలు, ప్రభుత్వం అందజేసే ఇతర సబ్సిడీ పథకాల్లో వీరి కృషి అమోఘం అనిర్వచనీయంగా ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వ పరంగా వారికి కనీస గుర్తింపునకు నోచుకోక ఎన్ని ఇబ్బందులు ఉన్న నోరు మెదపక మిన్నకుండి పోతున్నారు. ఒక్కో కంప్యూటర్ ఆపరేటర్ 4 నుండి 6 గ్రామపంచాయతీల వరకు అన్ని తమై చూసుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లాలోని 27 మండలాలకు గాను 85మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉండగా, కామారెడ్డి జిల్లాలోని 22మండలలకు గాను 63మంది కంప్యూటర్ ఆపరేటర్లు విదులు నిర్వహిస్తున్నారు



పనులుచేస్తున్న ఈపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు(ఫైల్)

2015 లో అపరేటర్లు విధుల్లో చేరినప్పుడు 8500వేతనం అందజేసే వారు 2021నుండి 19500 వేతనం అందజేస్తున్నారు. వేతనాన్ని ఈ పంచాయతీ మేయింటెనెన్స్ కింద10శాతం ఖాతాలో జమ చేసి ఎంపివోల ద్వారా అందజేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో సుమారుగా 1300 మంది కంప్యూటర్ ఆపరేటర్లుగా విదులు నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ లో ఒక కంప్యూటర్ ఆపరేటర్ ఉండాల్సి ఉంది. ఒక్కొక్కరు ఐదువరకు పంచాయతీల పనులు చూసుకుంటున్నారు. కానీ పనికి తగ్గ వేతనం మాత్రం అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో పంచాయతీలకు అవార్డులు వస్తున్నాయంటే దానికి మూల కారణం కంప్యూటర్ ఆపరేటర్లే. అయినప్పటికీ వీరికి కనీస ఉద్యోగ భద్రత, శ్రమకు తగ్గ తగిన వేతనం శ్రమ దోపిడీకి గురవుతునే ఉన్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు సమ్మెబాట పట్టినప్పటికీ గ్రామపంచాయతీ సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా విధులను నిర్వహిస్తున్నారు.

పనిభారం ఎక్కువైనప్పటికి ఎలాంటి ఆటంకం, ఇబ్బందులు ఏర్పడకుండా తమ పని తాము చేసుకోని పోతున్నారు. ఇవాళ కాకున్నా రేపైనా తమ సేవలను గుర్తించక పోతారా.. అని సకాలంలో నివెదికలను తయారు చేసితమ పై అధికారుల కు అందజేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీరి సేవల్ని గుర్తించి వేతన చట్టం అమలు చేసి, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించి మరింత ప్రోత్సాహం కల్పించే విధంగా చూడాలని కంప్యూటర్ ఆపరేటర్లు కోరుతున్నారు.

ఉత్తమ పంచాయతీలుగా అవార్డు రావటానికి ఈ పంచాయతీల సేవలే కారణం

రాష్ట్ర ప్రభుత్వం2015లో ఈ పంచాయతి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినప్పటి నుండి గ్రామ పంచాయతికి వచ్చే పల్లె ప్రగతి, పంచాయతీ సెక్రటరీ పర్మామెన్స్, కరెంట్ బిల్లులు, ఆదాయం, వసూలు, గ్రామపంచాయతీ వ్యయాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, ఇంటిపన్ను, నల్లపన్ను, జనన, మరణాల సర్టిఫికెట్, ఇతరత్రాలకు సంబంధించిన రికార్డులన్నీ సకాలంలో అందజేయడానికి, గ్రామాల్లో ఉన్న ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఈపంచాయతి ఆపరేటర్లు ఎంతగానో కృషిచేస్తూనే ఉన్నారు. గత కొన్ని రోజులుగా పంచాయతి కార్యదర్శులు సమ్మె చేస్తున్నప్పటికీ వారిస్థానంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులు, జెపిఎస్, ఒపిఎస్‌లకు అధనపు బాధ్యతలను అప్పగించారు. పనుల్లో ఎలాంటి ఆటంకం కలగకుండా, ఈ పంచాయతీ ఆపరేటర్లు నిర్విరామంగ పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చేస్తూ అదికారులు, ప్రజా ప్రతినిధుల నుండి ఈ పంచాయతి ఆపరేటర్లు మన్ననలు పొందుతున్నారు. ఆన్లైల్లో సేవలు ఇప్పటి వరకు ఎక్కడ కూడా అంతరాయం కలుగకుండా ఉన్నతాధికారులకు ఎప్పడికప్పుడు నివేదికలు అందజేస్తు ఉన్నారు.

మంజీరా టు మహారాష్ట్ర

- సరిహద్దులు దాటుతున్న ఇసుక
- జీరో దందాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని అధికారులు



టిప్పర్‌లో తరలుతున్న ఇసుక

నవతెలంగాణ-మద్నూర్

మంజీరా నది నుండి మహారాష్ట్రకు సరిహద్దులు దాటిస్తూ అక్రమంగా ఇసుక దందా జోరుగా కొనసాగుతుంది. రాష్ట్ర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు రహదారి గుండా కాకుండా అడ్డదారులైన మద్నూర్ మండల కేంద్రం నుండి పెద్ద తడగూర్ రోడ్డు గుండా సరిహద్దు భారీ లారీల్లో మహారాష్ట్రకు అక్రమ ఇసుక తరలిస్తున్నారు. వే బిల్లులు లేకుండా జీరో దందాలతో సరిహద్దులు దాటి ఇసుక రవాణా అవుతున్నా సంబంధిత శాఖల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. అక్రమ ఇసుక దందాను అదుపు చేయకపోవడంతో తెలంగాణ రాష్ట్ర ఇసుక మహారాష్ట్రకు తరలి వెళ్తుంది. ఇక్కడ ప్రజలకు ఇసుక లభించాలంటే నాలుగు వేల రూపాయలకు ఒక ట్రాక్టర్ కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితి నెలకొంది. ఇసుక మహారాష్ట్రకు తరలించడం ఇదెక్కడి న్యాయమంటూ ప్రజలు ప్రభుత్వ పనితీరుపై మండిపడుతున్నారు. ఇసుక రవాణా అధికార పార్టీ నాయకుల అండతో కొనసాగుతుందని ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తరలించకుండా అదుపు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఏడుగురి పేకాట రాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ విజయ్ బాబు ఆదివారం తెలిపారు. విజయ్ బాబు వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు డి. విజయ్ బాబు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టౌన్ -1 వ సిబ్బంది కలిసి తిలక్ గార్డెన్ రోడ్ దగ్గర లాడ్జ్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు చెప్పారు. షేక్ సిరాజ్, మహమ్మద్ ఇర్ఫాన్, బిలాలుద్దీన్, షేక్ ఇసాక్, షేక్ సలీం, మహమ్మద్ రఫీక్, షేక్ నజీర్‌ను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 7400 నగదు ఏడు సెల్ ఫోన్స్, నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు తెలిపారు.

ఎయిడ్స్‌తో అసువులు బాసిన వారికి నివాళ్లు

నగరంలో క్యాండిల్‌ర్యాలీ



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్ డే ని జిల్లా కేంద్రం లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఎయిడ్స్ వ్యాధితో చనిపోయిన వారికి నివాళ్లు అర్పిస్తూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆదివారం కాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుదర్శనం మాట్లాడుతూ... ప్రజల్లో ఎయిడ్స్ పట్ల ఇంకా అవగాహనా పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం 1983 నుండి జరుగుతుందని, ఎయిడ్స్ వ్యాధి తో బాధపడుతున్న వారి పట్ల చిన్న చూపు ఉండొద్దని తెలిపారు. ఈ ర్యాలీ నగరంలోని ప్రధాన కూడలిలగుండా వెళ్తు పిఓడిటిటి వరకు కొనసాగింది. కార్యక్రమం లో ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్, జిల్లా టిబి హె చ్ ఐ వి సమన్వయ కర్త రవిగౌడ్, జిల్లా ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, రాజేందర్,ప్రోగ్రాం అసిస్టెంట్ నవీన్, వర్డ్, స్వచ్ఛంద సంస్థలు చైల్డ్ ఫండ్ ఇండియా, స్నేహసొసైటీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ స్థల పంచాయితీ

- తాత ముత్తాతల నుండి పెద్దమ్మ స్థలం ఊరిదే
- 24 కులసంఘాల ప్రతినిధులు
- పెద్దమ్మ దేవాలయం స్థలం మాదే :ముదిరాజ్‌లు
- మూడునెలలనుండి వివాదం

నవతెలంగాణ-వేల్పూర్



పెద్దమ్మ తల్లి ఆలయస్థలం

మండలంలోని రామన్నపేట గ్రామంలో మూడు నెలల నుండి ముదిరాజ్‌లు, ఇతర 24 కులాల మధ్య పెద్దమ్మ ఆలయ స్థల విషయంపై వివాదం చోటుచేసుకుంది. పెద్దమ్మ గుడి స్థలం మాదంటే మాది అంటూ మూడు నెలల నుండి వివాదం నెలకొంది. మిగతా 24 కుల సంఘాల ప్రతినిధులు ఇటీవల విలేకరుల సమావేశంలో ముదిరాజ్ కులస్తులపై ఎలాంటి బహిష్కరణ లేదని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ 90 ఏళ్ల నుంచి పెద్దమ్మ ఆలయ స్థలం గ్రామానికి సంబంధించిందని, పెద్దమ్మ బాయి వద్ద ఉండేదని అన్నారు. అనవసరంగా లేని పోనీ అపోహలు సృష్టిస్తున్నారని, రికార్డు పరంగా సాక్ష్యం తీసుకొస్తే పెద్దమ్మ స్థలం మీకే వదిలేస్తామని సవాల్ విసిరారు. చర్చలకు మేము సిద్ధం.. మీరు సిద్ధమా.. స్థలం వద్దనే చర్చలు పెట్టుకుందాం అని అంటున్నారు.

పెద్దమ్మ దేవాలయం స్థలం మాదే

ముదిరాజ్‌ల స్పష్టీకరణ

గ్రామంలోని పెద్దమ్మ దేవాలయం స్థలం తమదేనని ముదిరాజ్‌లు మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. వీడీసి వారు తమపై గ్రామ బహిష్కరణ లేదంటూనే అంతర్గతంగా బహిష్కరణను ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 530 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల 30 గుంటల భూమిలో 1941 నుండి కబ్జాలో ఉన్నామని రికార్డు పరంగా సైతం కాస్తు కాలంలో తమ పేరే ఉందని అన్నారు. ఆలయ స్థలాన్ని సర్వే చేయించడం విడిసి పెద్దలకు నచ్చలేదని, సుమారు 20 లక్షలు. వెచ్చించి మొరం, ప్రహరీ వేసి అభివృద్ధి చేశామని చెబుతున్నారు. ఆలయంలో జరుగుతున్న తప్పుడు పనులను అడ్డుకున్నందుకే గ్రామస్తులు తమపై బహిష్కరణ వేటు వేస్తున్నారని అంటున్నారు. గ్రామంలో ఇతర కులాల ఇళ్లలో ఉన్న తమ షాపులను ఖాళీ చేయించారని, దుకాణాల్లో సరుకులు ఇవ్వడం లేదని, కనీసం మాట్లాడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార యంత్రాంగం స్పందించి బహిష్కరణను ఎత్తివేయించి పెద్దమ్మ ఆలయ స్థలాన్ని తమకే కేటాయించాలని కోరారు. సమస్యను అధికారులు కలుగజేసుకొని శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

లాజికల్ థింకింగ్‌ని పెంపొందించుకోవాలి

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

లాజికల్ థింకింగ్‌ని పెంపొందించుకొంటే భవిష్యత్తు బాగుంటుందని డాక్టర్ రవికిరణ్ యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ సైన్స్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈ వేసవిలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తమ సబ్జెక్టులలో లాజికల్‌గా ఆలోచించి, నిర్ణయాలు తీసుకున్నట్లయితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. వేసవికాలంలో సమయాన్ని వృధా చేసుకోకుండా సమ్మర్ సైన్స్ క్యాంపులో శిక్షణ తీసుకున్న విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ రఘురమణ, హెల్త్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు రమణాచారి, స్కూల్ ప్రిన్సిపల్ దేవేంద్ర పటాస్కేర్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, రవీందర్, కోశాధికారి శ్రీధర్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, గంగన్న, ఉమకాంత్, సంజీవరెడ్డి, నాగరాజు, లింగారెడ్డి సురేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ముధోల్

రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మెన్ తీగల వెంకటేష్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్, తరోడ, గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముధోల్, బాసర మండలాల్లో 13వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరి ఏ గ్రేడ్ క్వింటాల్‌కు ధర రూ.2060, బి గ్రేడ్ రూ.2040 ఉందని అన్నారు. రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. పీఏసీఎస్‌లో రైతుల కోసం నిరంతరం పనిచేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బండారి గంగాధర్, వెంకటాపురం సర్పంచ్ సాయినాథ్, నాయకులు రవికిరణ్‌గౌడ్, బోజేందర్, ఏయ్యుఖాన్, లతీఫ్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ పరీక్షను పర్యవేక్షించారు. నలంద కళాశాలలో జరిగిన పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 345 మంది దరఖాస్తులు చేసుకోగా 231 మంది హాజరయ్యారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మెరిట్ ఆధారంగా వంద మంది అభ్యర్థులను ఎంపిక చేస్తామని స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. ఎంపికైన వారికి భోజనం, వసతితో పాటు ఉచిత పుస్తకాలను అందిస్తామని అన్నారు. ఆయా పోటీ పరీక్షలపై ఎంపికైన అభ్యర్థులకు జూన్ 1వ తేది నుంచి తరగతులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

చల్లని పానీయాలకు గిరాకీ

- ఎండలతో బేజారు
- వడగాలులతో అల్లాడుతున్న జనాలు
- జ్యూస్‌లకు డిమాండ్
- కొబ్బరిబోండాలకు గిరాకీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఉమ్మడి జిల్లాలోని వాతావరణం నిప్పుల కొలిమిలా రగులుతోంది.. ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా 45 డిగ్రీలు నమోదు కావడం గమనార్హం. దీంతో రెడ్ జోన్‌లోకి జిల్లా వెళ్ళింది.. వేడిగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎండ వేడిమికి జనాలు అల్లాడిపోతున్నారు.. ఉదయం 9 గంటలు దాటితే ఉక్క పోత చికాకు తెప్పిస్తుంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఆందోళనకు గురి చేస్తున్నది. ఎండవేడిమితో కరెంటు లేకుండా ఇండ్లు, కార్యాలయాల్లో ఉండలేని పరిస్థితి నెలకొంది. వడ గాల్పులకు ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు పగలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి వినియోగించే వస్తువులకు డిమాండ్ పెరిగిపోయింది. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లకు భలే గిరాకీ ఏర్పడింది. పండ్ల జ్యూసులకు డిమాండ్ పెరిగింది.

తీసుకోవలసిన జాగ్రత్తలు...

వదులు దుస్తులు వేసుకోవాలి .తెలుపు రంగు దుస్తులు వేసుకోవడంతో వేడిని గ్రహించదు.. ప్రతిరోజు 5 నుంచి 6 లీటర్ల నీటిని తాగాలి. వీలైనంత వరకు నీడలో ఉండే ప్రయత్నం చేయాలి. వడదెబ్బ తగిలి సొమ్మసిల్లి పడిపోయినప్పుడు వెంటనే శరీరాన్ని తడిగుడ్డతో తుడిచి దగ్గరలో ఉన్న ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాలి. చంటి పిల్లలను బయటకి తీసుకెళ్లేటప్పుడు గొడుగు, తాగునీటిని అందుబాటులోకి ఉంచుకోవాలి. ఎక్కువగా చల్లని పదార్థాలను తీసుకోవద్దు. బయటి పదార్థాలను తినడంతో డయేరియా కు దారితీస్తుంది కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసం తీసుకోవాలి.

మేలు చేసే కీర దోస..

వేసవి కాలం వచ్చిందంటే చాలు శరీరానికి చలువ చేసే వాటిపై జనం ఎక్కువగా దృష్టి సారిస్తుంటారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం పండ్లు, పండ్ల రసాలను తీసుకుంటున్నారు .వీటితో పాటు దోసకాయల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. కీరదోస ఆరోగ్యానికి భరోసానిచ్చే దివ్య ఔషధం. దోసలో పుష్కలమైన పోషకాలు ఉండడంతో శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. పొటాషియం మెగ్నీషియం అధికంగా ఉండడంతో రక్తపోటుతో బాధపడే వారి శరీరానికి నీటిని లవణాలను అందించడంలో చక్కని పాత్ర పోషిస్తుంది.. కీరదోశలో 95శాతం నీరు ఉండడంతో డీహైడ్రేషన్ సమస్య రాదు. వాతావరణం వేడిగా ఉన్న రోజుల్లో ఏవైనా ఆకుకూరల రసంలో కలిపి జ్యూస్ తీసుకుంటే చలువ చేస్తుంది. తీవ్రమైన ఎండతో చర్మం కమిలిన చోట రాస్తే చల్లగా ఉంటుంది.





కొబ్బరి బొండాలకు భలే గిరాకీ..

ఎండ తాపాన్ని తట్టుకునేందుకు ప్రజలు వివిధ రకాల పానీయాలను సేవిస్తున్నారు .అందులో కొబ్బరి బోండాలు ఉంటే ఇంకా చెప్పనక్కర్లేదు. ఎండలు దంచి కొట్టడంతో కొబ్బరి బోండాలకు గిరాకీ అమాంతం పెరిగింది. ఆర్మూర్ బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ తదితర చోట్ల కొబ్బరి బొండాల దుకాణాల వద్ద సందడి ఎక్కువైంది. డీహైడ్రేషన్ భారీ నుంచి కాపాడే కొబ్బరి బోండాన్ని తాగేందుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఒక్కో కొబ్బరి బొండం 30 నుంచి 50 రూపాయల వరకు అమ్ముతున్నారు..

ఎండలో తిరగవద్దు...

ప్రజలు ఎండలో ఎక్కువగా తిరగకుండా ఉండడం చాలా మంచిది.. అత్యవసరమైతే జాగ్రత్తలు పాటిస్తూ బయటకి రావాలి. ఎక్కువగా నీరు తాగడంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండొచ్చు. ఎండలో ఎక్కువగా తిరిగితే అలసట, నీరసం, తలనొప్పి, తదితర సమస్యలు తలెత్తుతాయి...

డాక్టర్ యు, రాకేష్ కుమార్, వైద్యులు, బాలరాజు మెమోరియల్ హాస్పిటల్ ,ఆర్మూర్.

రాజీవ్ గాంధీ వర్ధంతి



నవతెలంగాణ-ఎడపల్లి

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మండల కేంద్రంలోని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజశేఖర్, భాస్కర్ రాజ్, బుడ్డ పోశెట్టి, బండ నవీన్, సున్నపుడేన్న, సరిదాస్, రాజగుప్త, మాసాపురం సాయిలు, బుడ్డ పోశెట్టి తదితరులున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

నవతెలంగాణ-మద్నూర్

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతిచెందాడు. ఎస్సై కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. డోంగ్లి మండలంలోని మొఘా గ్రామానికి చెందిన గూడ మల్వార్ అనిల్ తండ్రి రాజన్న (24) టెంట్‌హౌస్‌లో డెకరేటరుగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం 6:30 గంటల సమయంలో మేనూరు గ్రామానికి చెందిన నారాయణ ఇంటి వద్ద డెకరేషన్ పనిచేస్తుండగా 33 కేవీ విద్యుత్ వైరు తగిలి గాయాలయ్యాయి. వెంటనే మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మరణించాడు. ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా మొరం తరలింపు

- ప్రేక్షక పాత్రలో అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అధికార పక్షనేత పేరుతో మొరం అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అలాగే ప్రైవేటు వ్యక్తులకూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని రాముల గుట్ట తాండ, బస్వాయిపల్లి, ప్రాంతం నుంచి 15 రోజులుగా అక్రమంగా మొరం తరలిస్తుండడమే ఇందుకు నిదర్శనం. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీ సహాయంతో టిప్పర్లతో మొరాన్ని తరలిస్తున్నారు. ఇటీవల మండలంలోని ఓ రైస్‌మిల్ పనుల కోసం మొరం తరలిస్తున్నారు. అలాగే నాచుపల్లి శివారులోని రాముల గుట్ట తండా నుంచి మొరం తవ్వి ఓ ప్రయివేట్ రైస్‌మిల్ నిర్మాణానికి తరలిస్తున్నట్టు సమాచారం ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదు.

అలాగే బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో ప్రయివేటు రైస్‌మిల్ నిర్మాణాలకు ఒక్కో టిప్పర్‌కు సుమారుగా రూ. 2500 నుంచి 3500ల వరకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. ఇలా మొరం తవ్వుతూ అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులే బినామీ కాంట్రాక్టర్లుగా మారడంతో ప్రజలు ఏమాత్రం అడ్డుకోలేని పరిస్థితులున్నాయి. ఇదేమిటని ప్రశ్నించే వారిని బెదిరించడం తంతుగా మారింది. సంబంధిత అధికారికి సమాచారం ఇస్తే ఆ వ్యక్తి పేరును నాయకులకు చెబుతుండడంతో ప్రశ్నించేందుకు పలువురు జంకుతున్నారు. అభివృద్ధి పనులకు ఎవరూ అడ్డుచెప్పారు కానీ ఎలాంటి అనుమతి లేకపోవడం, కనీసం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వకపోవడంతో స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రేక్షకపాత్రలో అధికారులు..

అక్రమాలను అడ్డుకొని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాల్సిన స్థానిక అధికారులు తమ ప్రాంతంలో అడ్డగోలుగా నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు జరుపుతున్నా తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించాల్సిన అధికారులు చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మొరం అక్రమ రవాణాను నిలిపివేయించాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమంగా మొరాన్ని తరలిస్తున్న దృశ్యం

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

నవతెలంగాణ-దోమకొండ

రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, రైతుల కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఐరేని నర్సయ్య సీడీసీ చైర్మన్ పదవీ బాధ్యతలను మాచారెడ్డి మండలంలోని చుక్కపూర్ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో చేసిన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని, రైతు సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. చెరుకు రైతుల కోసం గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారని, రైతుల సమస్యల కోసం సీడీసీ చైర్మన్ సభ్యులు కృషి చేయాలని కోరారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ పదవికి ఎలాంటి ఆటంకం కలగనీయ్యకుండా రైతులకు శ్రమ పడి ఎల్లవేళలా వారికోసం తాము పనిచేస్తామని తెలిపారు. అనంతరం చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ పదవికి ప్రమాణ స్వీకారం చేసిన ఐరేని నర్సయ్యకు శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ముజిబొద్దీన్, ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మధుసూదన్ రావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విప్‌ను సన్మానిస్తున్న ఐరేని నర్సయ్య

సర్పంచుల సమస్యలపై మంత్రితో సర్పంచ్‌ల ఫోరం భేటీ

నవతెలంగాణ-నవీపేట్

జిల్లాలో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్ రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సర్పంచులతో కలిసి ఆదివారం భేటీ అయ్యారు. జిల్లాలో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసంతృప్తితో నిరసన బాట పట్టగా సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు ఏటీఎస్ శ్రీనివాస్ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తాము ఎదుర్కొంటున్న 14 సమస్యలపై గంటన్నర పాటు చర్చించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో సమస్యల పరిష్కార మార్గాల విషయమై కులంకశంగా మాట్లాడారని, త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఏటీఎస్ శ్రీనివాస్ తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలపై స్పందించి పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్న మంత్రికి పూల బొకేతో కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌ల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రాజేశ్వర్, ఉపాధ్యక్షులు రాజారెడ్డి, కోశాధికారి నరహరి సభ్యులు శంకర్, ఆనంద్, గంగాప్రసాద్, శ్రీనివాస్‌రావు, అమనుల్లా, రమేష్, మహేష్, గంగారెడ్డి, లక్ష్మీరాజ రెడ్డి తదితరులున్నారు.



వేముల ప్రశాంత్‌రెడ్డిన్ని కలసిన్న సర్పంచ్‌లు

ఇంటి నిర్మాణానికి సాయం

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-బిచ్కుంద

మనిషి జీవితం సుఖదుఃఖాల సమ్మేళనం. ఎవరి కష్టాలకు, బాధలకు వారు దుఃఖపడడం చింతించడం సహజం. ఇతరుల కష్టాలను చూసి కన్నీరు పెట్టే మనుషులు కొందరు అక్కడక్కడ సహజంగానే కనబడతారు. దానికి కారణం వారి మనసులో కలిగిన స్పందన, సహ హృదయం కలిగిన మరికొందరు వారి దగ్గర ఉన్న డబ్బును నిరుపేదలకు ఆర్థిక సాయం రూపంలో అందించి పేదవారిని ఆదుకుంటూ స్పందిస్తారు. ఇందుకు నిదర్శనం.. బిచ్కుంద మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన రాజు వ్యవసాయ కూలీగా తన కుటుంబంతో జీవనం కొనసాగిస్తూ గత కొన్నేండ్లుగా అద్దె గృహంలో తన కుటుంబంతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. అద్దెభారం మోయలేక తన సొంత ఇంటి నిర్మాణం చేయాలని అనుకున్నా డబుల్ బెడ్ రూమ్ పథకం ద్వారా సహాయం అందకపోవడం, ప్రజాప్రతినిధులు, అధికారులు కానీ ఆదుకోకపోవడంతో రాజు తన భార్యతో కలిసి రేకుల షెడ్డు నిర్మాణం చేసుకుందామని పునాదులు తవ్వుతున్న కథనం నవతెలంగాణ దిన పత్రికలో 'భారంగా మారిన అద్దెలు' అనే శీర్షికన ఈనెల 15న నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తోట లక్ష్మీకాంతరావు ఆదివారం శాంతాపూర్ గ్రామానికి చేరుకొని రాజు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి సరిపోయే మెటీరియల్ అందజేస్తానని, తన సహాయ సహకారాలు ఉంటాయని రాజుకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా రాజు కుటుంబ సభ్యులు తోట లక్ష్మీకాంతరావుకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగా సంగమేశ్వర్, నరేష్, గ్రామస్తులు ఉన్నారు.



సాయం చేస్తూన్న పలువురు

హామీలను నెరవేర్చడంలో విఫలం

నవతెలంగాణ-ఎడపల్లి/రెంజల్

తాము గత 15 సంవత్సరాల కాలం నుంచి ఐకేపీలో వీవోఏలుగా పనిచేస్తూ ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో అంకిత భావంతో పాల్గొంటున్నప్పటికీ వీవోఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని వీవోఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ల సాధనకై చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ.. తాము గత కొన్ని సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో తమ కుటుంబ జీవనాన్ని నెట్టుకొస్తున్నామని, ఆయా గ్రామాల వీవోఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు మార్కెట్లో నిత్యావసర సరుకులు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, ఐకేపీ అధికారులు ఇచ్చే వేతనం తమకు సరిపోవడం లేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల ఏర్పాటు చేయడంలో వీవోఏల పాత్ర ఎంతో కీలకమన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి అందేలా తాము కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ సేవలను గుర్తించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరవధిక సమ్మెలో శోభ, సుదర్శన్, పోచయ్య, యూసుఫ్, కొమరవ్వ లతా, కుమ్మరి, పుష్ప, జంగం సంధ్య మహేశ్వరి, నసీరా బేగం, మంజుల ఆయా గ్రామాల వీవోఏలు సమ్మెలో పాల్గొన్నారు.



ఎడపల్లిలో ధర్న చేస్తున్న వీవోఏలు



రెంజల్‌లో. ధర్నాలో పాల్గొన్న వీవోఏలు

28వ రోజుకు చేరిన వీవోఏల సమ్మె..

రెంజల్ :

మండల కేంద్రమైన రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 28వ రోజుకు చేరుకుంది. ఐకేపీలో వీవోఏలుగా పనిచేస్తూ తమకు ఎలాంటి గుర్తింపు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో డ్వాక్రా మహిళలను అవగాహన కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతానికి సహకరిస్తున్నా తమకు ప్రభుత్వం ఎలాంటి సహాయసహకారాలను అందించడం లేదని వారు తెలిపారు. ప్రభుత్వం వీరిని గుర్తించి కనీసం రూ.18వేల వేతనాన్ని ప్రకటించాలని, ఉద్యోగ భద్రతను కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తూ, ఐడీ కార్డులను ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు. వీవోఏల నిరవధిక సమ్మెకు రెంజల్ మండల సర్పంచ్‌ల ఫోరం తమ పూర్తి మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి వీవోఏల సమ స్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఎమ్మెస్ రమేష్ కుమార్, సర్పంచులు పి.సాయిలు, మాజీ ఎంపీటీసీ నరసయ్య, రాఘవేందర్, బాబునాయక్, రొడ్డ లింగం, వీరన్నగుట్ట సర్పంచ్ బి.రాజు, వీరన్నగుట్ట తండా సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఈనెల 22 నుంచి 24వరకు హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు భక్తిశ్రద్ధలతో హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు గ్రామ యువకులు, పెద్దలు తెలిపారు. నిత్యం ఉదయం సాయంత్రం మూడు రోజులపాటు జరిగే మహోత్సవ కార్యక్రమాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్టాపన కొరకు తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రోడ్ల భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డితో పాటు విశిష్ట వక్తలు, జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విట్టల్‌రావు, జెడ్పీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, ఎంపీటీసీ శ్రీ సుధా నాగేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అంగపట్నం లక్ష్మీ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌ను అందించిన పోలీసులు



పోగొటుకున్న ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఎస్ఐ సందీప్

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాకలాన్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే యువకుడు గత నాలుగు రోజుల క్రితం పెంటాకలాన్ పరిసర ప్రాంతంలో తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దాంతో ఆయన మూడు రోజుల క్రితం బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫోన్‌కు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్ఐ సందీప్‌కు అందించి ఫిర్యాదు చేశారు. దాంతో ఆయన ఆ వివరాలను నమోదు చేసుకొని సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. దాని ఆధారంగా యువకుడు పోగొట్టుకొన్న ఫోన్ అర్సపల్లిలో ఓ వ్యక్తి వద్ద ఉన్నట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకుని ఆదివారం బాధితుడు లక్ష్మణ్‌కు ఎస్ఐ సందీప్ ఫోన్‌ను అందించారు. దాంతో లక్ష్మణ్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఎవరైనా ఫోన్‌కు సంబంధించిన వివరాలు పత్రాలతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే దాన్ని తిరిగి పొందేందుకు ఆస్కారం ఉందని ఎస్ఐ సందీప్ తెలిపారు.

రెండు బైకులు ఢీ.. యువకులకు గాయాలు



గాయాలతో పడిపోయిన యువకుడు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

రెండు బైక్‌లు ఢీ.. యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన బీర్కూర్ మండల కేంద్రంలోని మంజీర నది బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. జుక్కల్ మండలం మిషన్ కల్లాలి గ్రామానికి చెందిన సుమంత్ (32), జీవన్ (24) అనే యువకులు పల్సర్ బైక్‌పై ఓ శుభకార్యం కోసం బీర్కూర్ వెళ్తున్నారు. అదే సమయంలో మంజీరా బ్రిడ్జ్ వద్ద మద్నూర్ మండలం డోంగ్లి గ్రామానికి షేక్ అహ్మద్(35)అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై నిజామాబాద్ నుంచి తన అత్తగారింటికి వెళుతున్న సమయంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరికి 108 అంబులెన్స్ వాహనం ద్వారా చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విధివంచితులకు సపర్యలు



గడ్డం గీయిస్తున్న సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవత్వంతో ఆలోచిద్దాం కార్యక్రమం పేరిట ఆదివారం బోధన్, నిజామాబాద్‌లో రోడ్లపైన నిస్సహాయక స్థితిలో విధివంచితులుగా తిరిగే వారిని గుర్తించి వారికి సపర్యలు చేశారు. కంపుకొట్టే మురికిబట్టలు, ఊడలు కట్టిన జుట్టుతో తిరిగే వారికి పెరిగిన జట్టుకత్తిరించి, స్నానాలు చేయించి సపర్యలు చేశారు. పట్టణ పరిసరాల్లో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ చేసిన సేవలు చూసి పలువురు అభినంచారు. కార్యక్రమంలో బోధన్ నిజామాబాద్ పోలిస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, విజయ్, శివ, వినోద్, సాయి, విక్షేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వధువును ఆదుకున్న మేడపాటి



వధువుకు ఆదుకున్న మేడపాటి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణానికి చెందిన నిరుపేద దళిత కుటుంబానికి చెందిన వధువు బేగరి సోని పెండ్లికి కావలసిన పుస్తె, మట్టెలను బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి వధువుకు వివాహ కానుకగా ఆదివారం వాటిని అందించి ఆదుకొన్నారు. పేద ప్రజలకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఎంపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వధువు సోనికి పుస్తె, మట్టెలను అందించినట్లు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, పట్టణ అధ్యక్షులు గుంత గంగాధర్, సీనియర్ నాయకులు సింది విజయ్, హరికృష్ణ తదితరులు ఉన్నారు

దుబాయిలో బోనాల్ వాసి అదృశ్యం



ప్రభాకర్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల గ్రామానికి చెందిన గరిగే ప్రభాకర్ (35) దుబాయ్‌లో అదృశ్యమైనట్టు గ్రామస్తులు తెలిపారు. బోనాల్ గ్రామానికి చెందిన గరిగే ప్రభాకర్ బతుకుదెరువు కోసం మే 2న కంపెనీ వీసాపై దుబాయ్‌కు వెళ్లాడు. మే 2 నుంచి కంపెనీకి సంబంధించిన అకామిడేషన్‌ను జాబ్ లాలి ప్రాంతంలో చూయించారు. దుబాయ్‌లోని పవర్ రిక్రూట్మెంట్ కంపెనీలో వీసా వచ్చింది. 4న కంపెనీకి వెళ్లకుండా రూమ్‌లో నుంచి బయటకు వెళ్లిపోయారు. అప్పటినుంచి ఇప్పటివరకు అతని ఆచూకీ దొరకలేదు. ఆచూకీ లభించకపోవడంతో అతని మిత్రుడు ఇండియాలోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ముంబైలోని ఏజెంట్‌కు ఈ విషయం చెప్పారు. దీంతో ఏజెంట్ దుబాయిలో కంపెనీ సిబ్బందితో మాట్లాడారు. కంపెనీలో జాయిన్ కాలేదని పనికి రాలేదని చెప్పడంతో ఆయన ఆచూకీ కోసం 15 రోజులుగా ఆయన కోసం వెతుకుతున్నారు. దుబాయిలో బోనాల్ వాసి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అదృశ్యమైన వ్యక్తి తండ్రి పర్వయ్య, తల్లి శాంతా, భార్య రాధ, ఇద్దరు కూతుర్లున్నారు. నిరుపేద కుటుంబం కావడం అప్పులు అధికం కావడంతో అప్పులు తీర్చడానికి దుబాయ్‌కి వెళ్లి ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమ భర్త ఆచూకీ తెలుసుకోవాలని కుటుంబ సభ్యులు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

- నేడు విగ్రహ ప్రతిష్ఠాపన, రేపు బోనాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఆదివారం వేద పండితుల మంత్రోశ్చరణాల మధ్య దేవత విగ్రహాల ధాన్య ప్రవేశం జరిపించారు. సోమవారం విగ్రహ ప్రతి ష్టాపన మహోత్సవం, మంగళవారం బోనాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య తెలిపారు. ప్రతి సంవత్సరం పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు

మొరం టిప్పర్ల ఇష్టారాజ్యం

- డీ 40 కెనాల్‌పై నిలుపవద్దని అధికారుల హెచ్చరిక

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలంలోని ఊట్పల్లి గ్రామ సమీపంలో నుంచి మొరం తరలిస్తున్న టిప్పర్ల డ్రైవర్లు ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని డీ-40 కెనాల్ కట్టపై మొరం టిప్పర్లు నిలపడమే కాకుండా మొరం వాహనాలను యథేచ్ఛగా నడిపిస్తున్నారని దాంతో భవిష్యత్తులో కెనాల్ కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు సోషల్ మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేయడంతో స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు ఆదివారం వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను డీ-40 కెనాల్ వద్దకు పంపారు. డీ-40 కెనాల్ కట్టపై నిలిపిన మొరం టిప్పర్లను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. మరోసారి కెనాల్ కట్టపై మొరం వాహనాలు నిలిపినా, దీనిపై నుంచి మొరం తరలించినా వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 4
సోమవారం 22 మే 2023

గ్రామదేవతలకు జలాభిషేకం



బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామంలో ఆదివారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఇంటింటి నుండి బోనాలు తీశారు. గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. ఈసందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురుసి పంటలు మంచిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐటి హబ్ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త న్యూ కలెక్టరేట్ రోడ్డులో నిర్మిస్తున్న ఐటీ హబ్ పనులను ఆదివారం పరిశీలించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేవు

- ఇబ్బందులు పడుతున్న పాఠకులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గల గ్రంథాలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ప్రకటనలు వెలువడిన ఇక్కడకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుంది. పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు కావడంతో ఎక్కువమంది విద్యార్థులు గ్రంథాలయానికి వస్తున్నారు. ఉదయం 7 గంటల నుండి రాత్రి 10 వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది. 200 మందికిపైగా అభ్యర్థులు వస్తున్నారు. పెద్ద సంఖ్యలో యువతులు, మహిళలు వస్తున్నారు. ముఖ్యంగా మహిళ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆర్మూర్‌లో గ్రంథాలయం

మొదటి అంతస్తు నిర్మాణంపై ఎదురుచూపులు


ప్రస్తుతం ఉన్న గ్రంథాలయంలో ఒక పెద్ద హాలు, రెండు చిన్న గదులు ఉన్నాయి. గ్రంథ పాలకురాలి గదిలోనే అభ్యర్థులు చదువుకుంటున్నారు. కొద్దిగా ఆలస్యమైన కుర్చీ దొరకని పరిస్థితి ఉంది. పైఅంతస్తు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్ ఎం బి రాజేశ్వర్ శిలాఫలకానికి ప్రారంభం చేశారు. మరుగుదొడ్ల నిర్మాణం, పై అంతస్తు, కింద మరమ్మత్తుల నిర్మాణానికి 42 లక్షలు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులు ప్రారంభం కాలేదు. నిర్మాణ పనులు ప్రారంభిస్తే చదువుకునేందుకు తమకు ఇబ్బందులు తలెత్తుతాయని ఉద్యోగార్తులు పాఠకులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న

గ్రంథాలయము ఉదయం 7 గంటల నుండి రాత్రి పది గంటల వరకు తెరిచి ఉంటుంది. రెండు హాల్స్ రీడింగ్ రూమ్స్, పుస్తకాల గది, బాత్రూం. మెట్ల కింద ఒక బాత్రూమ్. వేసవిలో నాలుగు కూలర్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడున్న బాత్రూం కూల్చివేసి దాని స్థానంలో ఇంకో బాత్రూం నిర్మాణం చేస్తారు.

నేడు మంత్రి వేముల జిల్లా పర్యటన

నవతెలంగాణ-వేల్పూర్



సోమవారం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు చేయనున్నారు ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగు జిల్లా స్థాయి సీఎం కప్(ఖోఖో,కబడ్డీ,వాలీబాల్) క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బాల్కొండ నియోజకవర్గం లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు మధ్యాహ్నం భీంగల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం భీంగల్ - తూమ్ పల్లి బిటి రోడ్ (రిన్వల్) 3 కోట్ల 4 లక్షలతో పునరుద్ధరణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు

బెజ్జోరా, ముచ్కూర్ గ్రామాల్లో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు సాయంత్రం భీంగల్ నుండి ముచ్కూర్ రోడ్ పురానిపేట్, పల్లికొండ గ్రామాల్లో 2.25 లక్షలతో శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్‌కు సన్మానం



డాక్టర్ సంజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఖలీల్ వాడి నందుగల రోటరీ సభ్యులు మాజీ అధ్యక్షులు డాక్టర్ పివి కృష్ణమూర్తి గిరిజ రెటీనా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవం సందర్భంగా రోటరీ సభ్యులు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్‌ని రోటరీ క్లబ్ నిజామాబాద్ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. వారికి రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ చేస్తున్న జైపూర్ ఫ్రూట్ శిబిరం గురించి తెలిపారు. తూ అనంతరం ఘనంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సతీష్ షాహ , విజయరావు బాబురావు, మంచాల కృష్ణ జ్ఞాన ప్రకాష్, శ్యామగర్వాల్ రాజ్కుమార్ సుబేదార్ ధన్వాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హిమాలయ పర్వతారోహణ చేసిన వ్యక్తికి సన్మానం



పర్వతారోహణ చేసిన వ్యక్తిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

హిమాలయ పర్వతారోహణ (5364 మీటర్స్) విజయవంతంగా ముగించుకొని వచ్చిన పట్టణానికి చెందిన గిరిధర్‌ను పట్టణంలోని మామిడిపల్లి ఓం విజ్ఞాన యోగా కేంద్రంలో ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సాయన్న, దత్తాద్రి, గంగారాం, డై శ్రీను, సూరజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కాలనీలో శ్రమదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఆదివారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సండే తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా రెండో వారం కాలనీ వాసులు రెండు గంటల పాటు శ్రమదానం చేశారు. కమ్యూనిటీ హాలు పక్కనున్న రోడ్‌పై ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు, ముళ్ళ చెట్లను కొట్టేశారు. మురుగు కాలువలను శుభ్రం చేశారు. జర్నలిస్ట్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, కార్యదర్శులు రాజు, సాయన్న, రాజ్ కుమార్, కాలనీ పెద్దలు ఎల్‌టి. కుమార్, గణపతి, దమ్మన్న స్వామి, భూమయ్య, సాయన్న, నితిన్, దినేష్, రవి, భాజన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యాధికారి స్పందించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి (టీయూ) అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి సూపర్వైజర్ పోస్టు (ఎస్ టి ఎస్)ఖాళీగా ఉందని, దీంతో టీ బి వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు.. కాంట్రాక్టు బేసిక్ లో పనిచేసే వ్యక్తి ఐదు నెలల నుండి విధులకు రావడం లేదని, కిందిస్థాయి ఉద్యోగులకు ఇన్చార్జ్ బాధ్యతలు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయని వాపోతున్నారు. జిల్లా వైద్యాధికారి సుదర్శనం, (డిటిసిఓ) లు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆసుపత్రులలో రెగ్యులర్ వైద్యులు, ఉద్యోగులు లేక ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న వారు అందుబాటులో ఉండక పోవడంతో ఆస్పత్రికి వచ్చే టీ బి వ్యాధిగ్రస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రెగ్యులర్ సూపర్వైజర్ వ్యక్తిగత కారణాలతో విధులకు హాజరు కాకపోవడంతో ఇన్చార్జి బాధ్యతలు ఒకరికి ఇచ్చినట్టు మెడికల్ ఆఫీసర్ అయోషా ఫిర్దోస్ తెలిపారు.

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్నారైల అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నియామకం

నవతెలంగాణ-ఆర్మూర్





తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఎన్నారై కువైట్ అధ్యక్షునిగా బట్టు స్వామి కత్తర్, ఉపాధ్యక్షులుగా గుర్రె రాజేందర్‌ను రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ నియమించినట్టు జిల్లా నాయకులు గగ్గుపల్లి శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్ దేశాలలో ఎదురవుతున్న ఇబ్బందులపై సమస్యలపై కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

బండి సంజయ్‌కు సన్మానం



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ఆదిలాబాదులో జరుగుతున్న ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావు కొడుకు వివాహానికి వెళుతున్న మార్గమధ్యలో ఆదివారం పెర్కిట్ బైపాస్ రోడ్డు వద్ద బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో, పూలదండతో సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు పల్లె శ్రీనివాస్, పట్టణ కార్యదర్శులు పులి యుగంధర్, గుగులోత్ తిరుపతి నాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు విగ్నేశ్వర్ గౌడ్, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షులు సాయినాథ్ రెడ్డి, దళిత మోర్చ పట్టణ కార్యదర్శి బ్యావత్ ప్రవీణ్, బిజెపి సీనియర్ నాయకులు భూపేందర్, యోగిత్, రైతులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ భాస్కరా చారి

నవతెలంగాణ-ముప్కాల్



మాట్లాడుతున్న ఎస్ఐ

మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు రాత్రి పూట పలు జాగ్రత్తలు వహించాలని ఎస్ఐ భాస్కరా చారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయా గ్రామాలలోని ప్రజ లు విహారయాత్రలకు వెళ్లిన, శుభకా ర్యాలకు, బంధువుల ఇంటికి వెళ్లిన పోలీసులకు ము ందస్తు సమాచారం అందించా లని సూచిం చారు. అదేవిధంగా సైబర్ నేరా లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన 100 డయల్ కు సమాచారం అందిస్తే మరుక్షణమే మీ ముందు ఉంటామని అన్నారు. మహిళల రక్షణకు 100 డయల్ ఒక మంచి ఆయుధమన్నారు..

నేటి నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని రైతులకు సోమవారం నుండి 65 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని మూడు సహకార సంఘాల పరిధిలో బోర్గాం (పి), మోపాల్, బాడ్సి సహకార సంఘాలలో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దాదాపుగా 1664 జీలుగ విత్తనాల సంచులు వచ్చాయని రైతులు తమ వెంట పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌ను తీసుకుని వచ్చి విత్తనాలను తీసుకెళ్లాలని కోరారు

దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు రాజీవ్ గాంధీ

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి
- రాజీవ్ గాంధీకి ఘన నివాళ్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్/కమ్మర్‌పల్లి/ఆర్మూర్

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కోశాధికారి సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా వారు కాంగ్రెస్ భవన్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినాయక్‌నగర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పిన్న వయసులో భారతదేశ ప్రధానిగా ఎన్నికై భారతదేశాన్ని శాస్త్ర, సాంకేతిక, టెలి కమ్యూనికేషన్ రంగంలో దేశాన్ని అభివృద్ధి చేయడంతో పాటు దేశంలోని 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించారన్నారు. విద్యాసంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు రాజీవ్ గాంధీ అని, ఆయన్ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఒక సంవత్సరం వరి వేయాలని, మరో సంవత్సరం మొక్కజొన్న వేయమని ఇంకో సంవత్సరం దొడ్డు రకం వడ్లు కొనమని ఇలా సంవత్సరానికో పంట వేయమని రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. రైతుల ఆత్మహత్యలు కేసీఆర్ పాలనలో రెట్టింపు అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నీరు అందించడానికి లక్షల కోట్లు పెట్టి ప్రాజెక్టును నిర్మించామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు సాగునీరు కోసం ప్రజలు తాగునీరు కోసం ఎందుకు ఇబ్బందులు పడుతున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం వారి కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే ప్రాజెక్టు నిర్మిస్తున్నారే తప్ప రైతాంగాన్ని ఉద్ధరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఆయన ఎద్దేవా చేశారు. జిల్లా రైతులు, ప్రజలు తాగునీటికీ సాగునీటికి ఇబ్బంది పడుతున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అలీ సాగర్ గుత్ప లాంటి ప్రాజెక్టులు నిర్మించామని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు పేరుతో డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని రైతులకు అదనంగా ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, బ్యాంకుల రుణాలు, సబ్సిడీ ఎరువులు లాంటివి లేకుండా చేశారని ఆయన మండిపడ్డారు. జిల్లాలో ఉన్న వరి, మొక్కజొన్న ,పసుపు రైతులు సాగునీరు, వ్యవసాయ సబ్సిడీలు, పంటకు సరైన మద్దతు ధర లేక నానా ఇబ్బందులు పడుతుంటే జిల్లాలో ఉన్న మంత్రి ఎమ్మెల్యేలు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుండి రైతులకు విత్తనాలు, పంట రుణాలతో పాటు వ్యవసాయ యంత్రాలు, సబ్సిడీ ఎరువులు కూడా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హందాన్ నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, మీసాల సుధాకర్, జావేద్ అక్రమ్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, విక్కీ యాదవ్, రామర్తి గోపి, సంతోష్, పోల ఉష, రేవతి, విజయలక్ష్మి, విపుల్ చంద్రకళ, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి : రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సంకేట రవి ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, పేద ప్రజల కోసం రాజీవ్ గాంధీ కన్న కలలను నిజం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమ్మర్పల్లి పట్టణ అధ్యక్షులు నిమ్మ రాజేంద్రప్రసాద్, నాయకులు బుచ్చి మల్లయ్య, సల్లూరి గణేష్ గౌడ్, సుంకేట శ్రీనివాస్, వేములవాడ జగదీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రాజీవ్ గాంధీ వర్ధం

ఆర్మూర్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని భారత రత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అంగడి బజారులో గల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ముందుచూపు వల్లే నేడు దేశం టెక్నాలజీ, టెలికం రంగంలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని సాంకేతిక భారత నిర్మాత రాజీవ్ గాంధీ అని అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించారని, పంచాయతీ రాజ్ చట్టం తెచ్చి గ్రామ స్వరాజ్యం దిశగా అడుగులు వేశారని అనానరు. ఫిరయింపుల చట్టం తెచ్చి రాజకీయల్లో మార్పు తెచ్చాడని అన్నారు. కార్యక్రమంలో నాయకులు విట్టం జీవన్, మీర్ మాజీద్, రవికాంత్ రెడ్డి, నీరజ్, జిమ్మి రవి, మందుల పోశెట్టి, ఫాయిమ్, ఉస్మాన్, మెహబూబ్, హబీబ్, బాలకిషన్, శ్రీకాంత్, అఖిల్, పాషా తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : జిల్లా కేంద్రంలో..



ఆర్మూర్‌లో..

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలి : ఏఐటీయూసీ

- నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల విస్తృతస్థాయి సమావేశం నగరంలోని ఏఐటియుసి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశం యూనియన్ జిల్లా నాయకులు సాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, పని భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన మూడువేల రూపాయల వేతనాన్ని బకాయిలతో సహా చెల్లించాలని, కార్మికులకు రావలసిన వంట సామాగ్రి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని అన్నారు. కోడిగుడ్డును ప్రభుత్వమే సరఫరా చేయాలని, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు, బిల్లులు చెల్లించాలని తదితర డిమాండ్లతో జూన్ మొదటి వారంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు వై.ఓమయ్య, జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ, ప్రధాన కార్యదర్శి టీ.చక్రపాణి, ఉపాధ్యక్షులు నాగలక్ష్మి, గంగమణి, సహాయ కార్యదర్శులు స్రవంతి, గంగాధర్, కోశాధికారి బాలరాజు లతోపాటు 34 మండలాల అధ్యక్ష కార్యదర్శులను కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజీవ్‌గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు దరఖాస్తు చేసుకోండి

- ఎన్ఎస్‌యూఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజీవ్ గాంధీ ఆన్లైన్ కాంపిటీషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధ్యక్షులు వరద భట్టు వేణు రాజు కోరారు. సంచలనాత్మక హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే దిశగా జూన్ 2 ను నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కోసం నిజామాబాద్ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ వివరాలను వెల్లడించారు. జూన్ 2 ను నిర్వహించే రాజీవ్ గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో నిజామాబాద్ జిల్లాలోగల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రతి నిరుద్యోగ యువతీ యువకులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పోటీలో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ముందుగా 7661899899 గల నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ వెబ్ లింక్ తో కూడిన ఒక ఎస్ఎంఎస్‌ను పొందుతారని, ఆ లింకు ద్వారా వారి వివరాలను అందులో జూన్ 1 లోగా నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలో పాల్గొన్న అభ్యర్థులకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రథమ బహుమతి ల్యాప్ టాప్, ద్వితీయ బహుమతి స్మార్ట్ ఫోన్, తృతీయ బహుమతి ట్యాబ్‌తోపాటు ప్రతి నియోజకవర్గంలో 40 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందని ప్రోత్సాహక బహుమతులలో 10 స్మార్ట్ వాచ్లు, 10 ఇయర్ పాడ్లు, 10 హార్డ్ డ్రైవ్ లు ,10 పవర్ బ్యాంకులు బహుకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ప్రత్యేక బహుమతుల కింద ఎలక్ట్రిక్ స్కూటర్లను కూడా బహుకరిస్తారని తెలిపారు. ఈ బహుమతిని సోనియా గాంధీ హైదరాబాదులో ప్రదానం చేస్తారని ఆయన చెప్పారు. 60 నిమిషాల్లో 60 ప్రశ్నలకు సమాధానం ఇవ్వవలసి ఉంటుందని అంశాలన్నీ భారతదేశ భౌగోళిక ,చరిత్ర సాంస్కృతి, తెలంగాణ సాంస్కృతి, చరిత్ర, సామాజిక ఉద్యమాల గురించి ప్రశ్నలు ఉంటాయని ఆయన తెలిపారు. కావున నిజామాబాద్ జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని పరిధిలో 16 నుండి 35 సంవత్సరాలు గలవారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే 8142903456 మరియు 8142803456 నెంబర్లకు కాల్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కుషాల్ రెడ్డి, మిక్కీ, సోహం, లోకి, వినయ్, ప్రవీణ్, మని, ఉదయ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ క్విజ్ పోటీల కరపత్రాల ఆవిష్కరణ

మెరుగైన కంటి వైద్య సేవలు



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గిరిజ ఐ ఆస్పత్రిలో మెరుగైన కంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం కంటి వైద్య నిపుణుల ఆస్పత్రిని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ప్రారంభించి మాట్లాడారు. నిజామాబాద్ నగరంలో ప్రత్యేక కంటి వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్ జిల్లా ప్రజలకు కంటి వైద్య చికిత్సలు మెరుగ్గా అందించేందుకు, వెంటనే కంటి ఆపరేషన్ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. ఆధునాతనమైన టెక్నాలజీతో కంటి ఆపరేషన్లు చేసే పరికరాలను అందుబాటులో ఉంచారని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి యాజమాన్యం రాఘవ డాక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.